క్లుప్తంగా

గాయత్రీదేవికి సన్మానం


రామాయణ సప్తాహ ప్రవచనం చేసిన గాయత్రీదేవిని సన్మానిస్తున్న దృశ్యం

నక్కపల్లి : చినదొడ్డిగల్లు శ్రీరామ పంచాయతన ఆలయంలో రామాయణ సప్తాహ ప్రవచనములు నిర్వహించిన విశ్రాంత తెలుగు పండితురాలు డాక్టర్ వేదాల గాయత్రీదేవిని గురువారం ఘనంగా సన్మానించారు. వారం రోజులుగా గాయత్రీదేవి రామానుగ్రహంతో శ్రీమద్రామాయణ సప్తాహ్నిక పారాయణ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ముగింపు రోజున రామపట్టాభిషేకం, సీతారాముల కల్యాణం అనంతరం ఆలయ ధర్మకర్త శ్రీపాద సత్యదేవ శర్మ ఆధ్వర్యంలో గ్రామస్తులు గాయత్రీదేవిని ఘనంగా సత్కరించారు.

12, 27 తేదీల్లో నగర సంకీర్తనలు


మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకుడు అప్పారావు

మునగపాక : ఏకాదశి పర్వదినాల్లో భాగంగా ఈ నెల 12, 27 తేదీల్లో గ్రామాల్లో నగర సంకీర్తనలు నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు కోరారు. గణపర్తి శివాలయంలో గురువారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సనాతన సంప్రదాయాలను కాపాడుకోవాలని, హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. ఈ నెల 30న సామూహిక హారతి కార్యక్రమం ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గిన్నే వీరమహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఎస్.రాయవరం : క్రీడల వల్ల యువతలో మానసిక ఉత్సాహం పెరుగుతుందని ఆంధ్రా జేపీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిక్కి కోదండరావు అన్నారు. రేవు పోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామాల్లో కోస్టల్ సెక్యూరిటీ డీఎస్పీ కాళిదాసు సహకారంతో క్రీడా పోటీలు నిర్వహించారు. ఉత్సాహభరితంగా నిర్వహించిన పోటీల్లో చింతకాయల బలరామ్ టీమ్ విన్నర్‌గా నిలిచారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు అర్జిలి శ్రీను, సీనియర్ జర్నలిస్టు బంగారుచిట్టి పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

మునగపాక : ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని వీఏఏ సింధూజ కోరారు. మునగపాకలోని అభయాంజనేయ స్వామి మూలసంఘ పరిధిలోని గురువారం ఈ-పంట నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ-పంట నమోదు ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు పంట నష్టపరిహారం అందుతుందన్నారు. ఇందుకోసం ఏ భూమిలో ఎంత విస్తీర్ణంలో ఎటువంటి పంటలు వేశారనే వివరాలు అందించాల్సి ఉంటుందన్నారు. రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్, పలువురు రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'నా భూమి- నా దేశం' సమావేశం నేడు

కోటవురట్ల : నా భూమి- నా దేశం కార్యక్రమంపై అవగాహన కోసం ప్రజా ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తామని ఇందులో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నా భూమి- నా దేశం, నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం నిర్వహించనున్నట్టు తెలిపారు.

పల్లె గూటికి ప్రజావైద్యం

- పీహెచ్‌సీల్లో 24 గంటల వైద్య సేవలు
- పూర్తిస్థాయిలో అందుబాటులో మందులు
- 19 గ్రామాల ప్రజలకు మేలు

జగనన్న సర్కారు ప్రజారోగ్యమే శ్రీరామ రక్షగా భావించి పీహెచ్‌సీలో 24 గంటల వైద్య సేవలను అందిస్తోంది. పీహెచ్‌సీలో ఇద్దరేసి వైద్యులను, పుష్కలంగా మందులు అందుబాటులోకి తీసుకువచ్చారు.


దిమిలి పీహెచ్‌సీ భవనం


పుష్కలంగా మందులు

రాంబిల్లి : మండలంలో రాంబిల్లి , దిమిలి పీహెచ్‌సీలు ఉన్నాయి. రాంబిల్లి పీహెచ్‌సీకి రూ. 1.5 కోట్లతో అధునాతన భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. దిమిలి పీహెచ్‌సీలో రూ.25 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ సీఎస్ఆర్ నిధులు రూ.50 లక్షలతో అదనపు భవనాన్ని నిర్మించారు.

ఈ రెండు పీహెచ్‌సీల్లోనూ ఇద్దరేసి వైద్యులున్నారు. రాంబిల్లి పీహెచ్‌సీలో కొన్నేళ్లుగా 24 గంటలు ప్రసూతి సేవలు అందుబాటుగా ఉండగా తాజాగా రాంబిల్లి, దిమిలి పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్య సేవలు 24 గంటల పాటు అందుబాటులోకి వచ్చాయి. దిమిలి పీహెచ్‌సీలో ఇప్పటివరకు సాయంత్రం 4 గంటల వరకే వైద్య సేవలందేవి. ఇప్పుడు రాత్రి వేళల్లోనూ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఈ పీహెచ్‌సీ పరిధిలో గల 19 గ్రామాలకు చెందిన 21వేల మంది ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

గతంలో ఒకే వైద్యుడు..అరకొర మందులు

గత ప్రభుత్వాల హయాంలో పీహెచ్‌సీకి ఒకే వైద్యుడు వుండే వారు. వైద్యుడు సెలవు పెడితే కింది స్థాయి వైద్య సిబ్బందే డాక్టర్ అవతారం ఎత్తేవారు. ఇక అరకొర మందులే దిక్కయ్యేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి సచివాలయం పరిధిలో గ్రామాల్లోనూ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి నెలకు ఒకటి లేదా రెండుసార్లు ఆయా గ్రామాల్లోనే వైద్య సేవలందించడం, మందులు ఇవ్వడం జరుగుతుంది. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

24 గంటలు వైద్య సేవలు



దిమిలి పీహెచ్‌సీలో గతంలో సాయంత్రం 4 గంటల తర్వాత పీహెచ్‌సీ మూసివేయబడేది. ఇప్పుడు 4 గంటల తర్వాత వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. పాము, కుక్క కాటు సహా పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలు, మందులను సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ ఆర్. వెంకటేష్, దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి

రాత్రి వేళల్లోనూ వైద్య సేవలు హర్షణీయం



దిమిలి పరిసర గ్రామాల ప్రజలు దాదాపు రైతులు, రైతు కూలీలే. పొలం పనుల్లోకి వెళ్లినపుడు పాము కాటుకు గురైతే సాయంత్రం నాలుగు తర్వాత దిమిలి పీహెచ్‌సీ మూసివేసి ఉండేది. ఇతర ఆసుపత్రులకు తరలించే సమయంలో ప్రాణాపాయ పరిస్థితి నెలకొనేది. ఇపుడు ఆ పరిస్థితి లేదు. రాత్రి వేళల్లోనూ వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయం.

– దబ్బీరు రాము, దిమిలి గ్రామ వలంటీర్

జగనన్న సురక్షతో నూరు శాతం సమస్యల పరిష్కారం


ఆశా కార్యకర్తలకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు


సోషల్‌మీడియా కో ఆర్డినేటర్‌లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

- నియోజకవర్గంలో 70,900 ధ్రువపత్రాల పంపిణీ
- ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : జగనన్న సురక్ష కార్యక్రమం దేశ చరిత్రలోనే వినూత్న కార్యక్రమంగా నిలిచిందని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. గురువారం యలమంచిలి వైయస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా పార్టీ కార్యకర్తలతో కలసి ఎమ్మెల్యే కన్నబాబురాజు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యాక్రమం ద్వారా యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో అన్ని గ్రామాల్లో శత శాతం అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అద్భుతంగా పనిచేసి ప్రజలకు ధ్రువపత్రాలు అందజేశారని తెలిపారు. ఆధార్ లింక్, ఎటువంటి ఆంక్షలు లేకుండా రేషన్ కార్డులు జారీ చేయడం జరిగిందన్నారు. అచ్యుతాపురం మండలంలో పూడిమడక గ్రామంలో 3వేల వరకు అత్యధికంగా ధ్రువపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. చాలా మంది ప్రజలు తమ పిల్లలు సరిగ్గా వారి పోషణను పట్టించుకోకపోవడం వారికి ప్రభుత్వ పథకాలు అందాలంటే ఒకే కార్డులో కుటుంబం అంతా నమోదై ఉండడంతో అనర్హులుగా ఆన్‌లైన్‌లో చూపించడం.. ఇలాంటి సమస్యలతో పలువురు పథకాలు అందక ఇబ్బందులు పడేవారని, జగనన్న సురక్ష కార్యక్రమంలో వాటిని సరిచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరావు, పట్టణ సచివాలయ కన్వీనర్ కర్రి శివ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు యర్రయ్యదొర, రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొండబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కస్పా రవికుమార్, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, సేనాపతి రాము కోఆప్షన్ సభ్యులు దూది నర్సింహమూర్తి, షేక్ సయ్యిద్ బీబీ, కౌన్సిలర్‌లు సత్తిబాబు, దాసరి కుమార్, సర్పంచ్‌లు గొన్నాబత్తుల శివ పాల్గొన్నారు.

ఆశాలకు నియామక పత్రాలు

వైయస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా వైద్యాన్ని గ్రామీణులకు మరింత చేరువ చేస్తోందని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. యలమంచిలిలో నూతనంగా నియామకమైన ఆశా కార్యకర్తలకు గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యలమంచిలిలో విలేజ్ క్లినిక్‌లు, అర్బన్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు మరింత ఉన్నతంగా వైద్య సేవలు అందించాలనేదే ప్రధాన లక్ష్యం అని అన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నూతనంగా నియమితులైన ఆశా వర్కర్‌లు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలని కోరారు.

సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు ప్రశంసలు

ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి సంక్షేమం గురించి ప్రజలకు తెలిసేలా ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించడంలో వైఎస్సార్ సోషల్ మీడియ కో ఆర్డినేటర్‌ల పాత్ర ఎంతో ఉందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. గురువారం యలమంచిలిలో సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు చేరవేయడంలో మంచి ప్రతిభ కలిగిన సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు ప్రభుత్వం అందించిన ప్రశంసాపత్రాలను ఆయన నలుగురికి అందజేశారు.

రూ. 84 లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం

అమృత్ 2.0లో భాగంగా చెరువు ఆధునికీకరణ


కొమ్మాయిగుండం చెరువు వద్ద వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి : పట్టణంలో కొమ్మాయిగుండం చెరువు వద్ద రూ.84 లక్షలతో అమృత్ 2.0 నిధుల్లో భాగంగా వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యలమంచిలి పట్టణంలో కొమ్మాయి గుండం చెరువు వద్ద ప్రజల అవసరార్థం వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్క్ నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరువులో పూడిక తీసి గట్ల చుట్టూ రాతితో రివిట్‌మెంట్, ప్లాంటేషన్, చక్కని లైట్లు, ఓపెన్ జిమ్, బాలబాలికలు ఆడుకోవడానికి జారుడు బల్లలు, ఆటల పరికరాలు ఏర్పాటు చేస్తామని, వాకింగ్ ట్రాక్‌ను టైల్స్‌తో నిర్మించడం జరుగుతుందని తెలిపారు. కార్యాక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, ఎంపీపీ గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు కోసం చెరువుగట్టు తవ్వేశారు


చెరువు గట్టును తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్

ఎస్.రాయవరం : మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేట్రేగి పోతున్నారు. తిమ్మాపురం రెవెన్యూ పరిధిలో చెరువు గట్టు అక్రమించి రోడ్డు కోసం చదును చేస్తుండగా స్థానికులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. జాతీయ రహదారి నుంచి నేరుగా జిరాయితీ భూమికి రోడ్డు వేసేందుకు గురువారం అక్రమార్కులు చెరువుగట్టు తవ్వి చదును చేపట్టారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ఆక్రమణలను అడ్డుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్, వీఆర్వో నూకరాజు పనులు చేపట్టిన వారి నుంచి వివరాలు తీసుకున్నారు. ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో ఆక్రమణదారులు చెరువు గట్టు ఉందని తమకు తెలియదని, యధావిధిగా గట్టు సరి చేస్తామని చెప్పడంతో రెవెన్యూ అధికారులు 24 గంటల వ్యవధిలో తవ్విన చెరువు గట్టు యథావిధిగా సరిచేయాలని లేదంటే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించి వెళ్లారు.

చురుగ్గా ఓటరు సర్వే


వాడ్రాపల్లిలో ఓటరు సర్వే


వెదురువాడలో ఓటర్ వెరిఫికేషన్ చేపడుతున్న దృశ్యం

మునగపాక : మండల వ్యాప్తంగా ఓటరు సర్వే చురుగ్గా సాగుతోందని తహసీల్దార్ పి.ప్రకాశరావు పేర్కొన్నారు. ఆగస్టు 21 వరకు గ్రామాల్లో సర్వే సాగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, అలాగే ఓటరు జాబితాలో సవరణలు చేయడం జరుగుతుందని తెలిపారు. బీఎల్‌వోలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి జాబితాలను అందుబాటులో ఉంచుతారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల నేతలు కూడా ఓటరు సర్వేలో చురుగ్గా పాల్గొంటున్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం ఇంటింటికీ ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. గురువారం అచ్యుతాపురం మండలంలోని వెదురువాడలో సర్పంచ్ కొయ్య శ్రీనివాస్,సిబ్బంది ఓటర్ వెరిఫికేషన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కొయ్య మహాలక్ష్మినాయుడు, కిలాడి బాబూజీ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

అక్రమంగా కంకర తవ్వకాలు


గుడి సమీపంలో కంకర తవ్వకాలు

రాంబిల్లి : పంచదార్లలో అక్రమంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయి. చారిత్రక పంచదార్ల పుణ్యక్షేత్రం సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా సుమారు 15 అడుగుల ఎత్తు వరకు కంకరను తవ్వేసి పక్కనే గల స్థలంలో చదును చేస్తున్నారు. తవ్వకాలు జరుపుతున్న ప్రదేశంలో గల పురాతన గుడిని దర్జాగా కూల్చేశారు. దీంతో ఈ గ్రామస్తులు అధికారులకు సమాచారం ఇచ్చారు. మూడు రోజులుగా పట్టపగలే ఈ తవ్వకాలు జరుగుతున్నాయని ఈ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. కంకర తవ్వకాలకు రెవెన్యూ అధికారుల సిఫార్సు మేరకు గనుల శాఖ నుంచి అనుమతులు ఉండాలి. అయితే ఎటువంటి అనుమతులు లేకుండా తమ గ్రామంలో కంకర తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. కంకర తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పి. భాగ్యవతి పేర్కొన్నారు.

పూడిక తీస్తే...10వేల ఎకరాలకు నీరు..

- నిరుపయోగంగా ముతా, భూమి కాల్వలు
- గత ఏడాది రూ.10 లక్షలతో కొంతమేర మరమ్మతులు


పూడికతీతకు నోచుకోని భూమికాలువ

నక్కపల్లి : గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా సాగునీటి వనరులు నిరుపయోగంగా మారాయి. పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో సుమారు 10వేల ఎకరాలకు సాగు నీరందించే భూమి కాలువ, ముతా గ్రోయిన్, మంగవరం ఆవ గ్రోయిన్‌లు మరమ్మతులకు చేరుకున్నాయి. ఏళ్ల తరబడి ఈ కాలువలు పూడిక తీతకు నోచుకోక సాగునీరు సక్రమంగా ప్రవహించడం లేదు. ఖరీఫ్‌లో తాండవ జలాలను ఈ భూమి, ముతా కాలువలు, మంగవరం, ఆవ గ్రోయిన్ ద్వారా విడుదల చేస్తారు. రైతులు ఈ కాలువల ద్వారా ప్రవహించే నీటిని ఉపయోగించి వరి, తమలపాకు, అరటి పంటలు సాగు చేస్తారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు ముందుగానే సరఫరా చేసింది. ప్రస్తుతం రైతులు విత్తనాలు జల్లారు. నారు మొలక దశలో ఉంది. అడప దడపా వర్షాలు పడడంతో నారు మళ్లకు ఇబ్బంది ఉండదని, నాట్లు వేసే సమయానికి మాత్రం నీరు పుష్కలంగా అవసరమవుతుందని రైతులు చెబుతున్నారు. అయితే కాలువ ద్వారా నీరు విడుదల చేసినప్పటికీ పూడికతీత చేపట్టకపోవడంతో నీరు చివరి ఆయకట్టు రైతులకు చేరే పరిస్థితి ఉండడం లేదు. భూమికాలువ ద్వారా నీరు ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో 35 క్యూసెక్కుల తాండవ నీరు విడుదలవుతోంది. ఆవ, ముతా కాలువల కింద సుమారు 5వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కాలువల ద్వారా మంగవరం, పెద్దిపాలెం, సత్యవరం, అరట్లకోట, మాసయ్యపేట, పెంటకోట తదితర గ్రామాలకు నీరు అందాల్సి ఉంది. ఇక భూమి కాలువ కింద మరో 5 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కాలువ ద్వారా పాయకరావుపేట, పీఎల్‌పురం, సీతారామపురం, నామవరం, గుంటపల్లి, ఒడ్డిమెట్ట, దేవవరం, గొడిచర్ల ఉద్దండపురం వరకు తాండవ జలాలు విడుదలవుతాయి. సుమారు 15 కిలోమీటర్ల దూరం పొడవు కలిగి తాండవ నదికి అనుసంధానంగా ఉన్న ఈ మూడు కాలువల్లో మట్టి దిబ్బలు పేరుకుపోయాయి. కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి తన ఎంపీ నిధుల రూ.10 లక్షలు మంజూరు చేయడంతో పాయకరావుపేట తాండ షుగర్ ఫ్యాక్టరీ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు కాలువలో పూడికతీత చేపట్టి మరమ్మతులు చేశారు. దీంతో అక్కడ వరకు మాత్రం పుష్కలంగా నీరు వస్తోంది. కాలువల్లో ఏర్పాటు చేసిన స్లూయిస్‌లకు షట్టర్లు లేకపోవడంతో వంతుల వారీగా వివిధ గ్రామాల వారు నీటిని ఉపయోగించుకునే వీలుండడం లేదని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ రావడంతో కాలువల్లో పూడికతీత చేపట్టాలని, అవసరమైన చోట్ల మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. కాగా ఆయా కాల్వలు, గ్రోయిన్ల మరమ్మతులకు గత ఏడాది రూ.8 కోట్లతో ప్రతిపాదనలు పంపించడం జరిగిందని నీటిపారుదల శాఖ ఏఈ డి.లోకేష్ తెలిపారు. తాండవ చక్కెర ఫ్యాక్టరీ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు కాల్వకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించడం, చివరి ఆయకట్టు వరకు కాలువ పూడికతీత పనులు, తుప్పలు తొలగించడం, స్లూయిస్‌లకు షట్ట ర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఇంకా నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం

కశింకోట: పెరటి కోళ్ల పెంపకం వల్ల ఆదాయంతోపాటు, ఆరోగ్యకరమైన మాంసాహారాన్ని పొందవచ్చని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం స్వయం సహాయక సంఘాల మహిళలకు రాయితీపై 50 యూనిట్ల పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషకాహారం అందుబాటులోకి తీసుకు రావడం కోసం ప్రభుత్వం పెరటి కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ఒక్కొక్క యూనిట్‌లో 11 కోళ్లను రూ.4 వేలకు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కోళ్లు పెట్టే గుడ్లను రోజుకి ఒకటి వంతున తినాలని, కుటుంబ సభ్యులతో కూడా తినిపించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

అమ్మపాలు అమృతం


తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి



రజాలలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


కె.వెంకటాపురంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో లబ్ధిదారులు


అచ్యుతాపురం ఎలిమెంటరీ పాఠశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి
- గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

యలమంచిలి : తల్లిపాలు బిడ్డకు అమృతం వంటిది అని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందజేస్తుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు చేపడుతుందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారిన పడకుండా వారికి నేరుగా ఇంటికి 10 రకాల సరకులను ప్రత్యేక సంచిలో వేసి ఆ కిట్టును నెలకు రెండుసార్లు ఇంటికి పంపే విధంగా ప్రభుత్వం బృహత్తర కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, కౌన్సిలర్ గొర్లె వెంకట్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొండబాబు, కోఆప్షన్ సభ్యురాలు షేక్ సయ్యిద్ బీబీ, అంగన్‌వాడీ సీడీపీవో ఇందిర పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతోనే సంపూర్ణాహారం

కోటవురట్ల: అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలతో పాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కె.వెంకటాపురంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ ఇంట్లో లభించే కూరగాయలు, పప్పుదినుసులతో పౌష్టికాహారాన్ని తక్కువ ఖర్చుతోనే తయారు చేసుకోవచ్చని వివరించారు.

తల్లిపాలలో రోగ నిరోధకశక్తి

రాంబిల్లి: తల్లిపాల ప్రాధాన్యంపై గురువారం రజాలలో అంగన్‌వాడీ వర్కర్లు అవగాహన కల్పించారు. తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు జానకీదేవి, ఉమ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు తల్లి పాలు పట్టాలన్నారు. ఇలా 6 నెలల వరకు తల్లిపాలు బిడ్డ తాగడంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. విజయవాహిని సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోషణ సఖిలు శ్రీలక్ష్మి, ఉమా మహేశ్వరి, పద్మ పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

అచ్యుతాపురం(అనకాపల్లి): తల్లి పాలే పిల్లలకు మేలని అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట ఎలిమెంటరీ పాఠశాల హెచ్‌ఎం అరుణ కుమారి అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పిల్లలకు పాలు ఇవ్వకుంటే తల్లులకు భవిష్యత్‌లో కొన్ని రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మి తెలిపారు. ప్రకృతి ప్రసాదించిన పౌష్టికాహారం తల్లి పాలని ఉపాధ్యాయుడు అప్పారావు అన్నారు. ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి, ఆయా రూప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


సత్తెమ్మతల్లి సన్నిధిలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామదేవతల మహోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గవరపాలెం సుంకరమెట్ట జంక్షన్ సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్‌లు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. మధ్యాహ్నభోజన కార్యక్రమాన్ని దాడి రత్నాకర్ ప్రారంభించారు. అంతకుముందు కమిటీ అధ్యక్షుడు బొడ్డేడ మోహనరావు మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రత్నాకర్‌లను శాలువాలతో సత్కరించి, అమ్మవారి ఫొటోలను అందించారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, కమిటీ కార్యదర్శి విల్లూరి త్రినాథ్, కోశాధికారి దాడి వెంకునాయుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.